మహిళల రక్షణకు ఏఐ నియంత్రణ చట్టం చేయాలి

కాచిగూడ: మహిళల సంక్షేమం, రక్షణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నియంత్రణ చట్టం చేయాలని జాతీయ బీసీ మహిళా జేఏసీ చైర్‌పర్సన్ మట్ట జయంతి గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... ప్రముఖ మహిళా నేతలు, రాజకీయ నేతలు, ప్రముఖుల భార్యల ఫొటోలను ఏఐ టెక్నాలజీ, డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా కొందరూ మార్ఫింగ్ చేస్తూ ఏఐని దుర్వినియోగం చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించే విధంగా కొత్త చట్టాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ పఠాన్ బస్తీలో దశాబ్దంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్ కాంగ్రెస్ నాయకులు ఆయనతో వెళ్లి జలమండలి జీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

సమగ్ర భూ సర్వే నిర్వహించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో సమగ్ర భూ సర్వే నిర్వహించి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూ భారతి చట్టం.. భూ సమస్యలన్నీ పరిష్కరిస్తుందా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. 18 సెక్షన్లతో తెచ్చిన ఈ చట్టం వల్ల రైతులు సమస్యలను ఎదుర్కొంటారని అన్నారు. వాస్తవంగా 33 లోపాలతో 13 లక్షల మంది పాస్ పుస్తకాలు లేకుండా కోర్టుల చుట్టి తిరగారని పేర్కొన్నారు.


మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మత్స్య సంపద పెంపొందించేందుకు ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు మంగళవారం ఆయనను కలిసి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలి

ముషీరాబాద్: ఎస్ఎస్‌సీ విద్యార్థుల కోసం ఇంటర్నల్ మార్కులు, గ్రేడింగ్ విధానాన్ని తిరిగి యథావిధంగా కొనసాగించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ట్రస్మా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో అంతర్గత మార్కులు, గ్రేడింగ్ విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడేదని ఎస్ఎన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలన్నారు.

కాచిగూడలో బీఆర్ఎస్ ఆవిర్భావ ఏర్పాట్లు



కాచిగూడ: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈనెల 27వ తేదీన కాచిగూడలో ఘనంగా నిర్వహించేందుకు డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ నేతృత్వంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఇటీవల నిర్వహించిన డివిజన్ కార్యకర్తల సమావేశంలో పార్టీ ఆవిర్భావ వేడుకల కోసం పలు సూచనలు, సలహాలు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డివిజన్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు భీష్మదేవ్ తెలిపారు. డివిజన్ మొత్తం గులాబీమయం చేస్తామన్నారు. 27న కాచిగూడ డివిజన్ నుంచి 10 బస్సులు, 5 దళిత బంధు కార్లు, 5 పార్టీ నేతల కార్లలో బయల్దేరనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ కూచిపూడి నృత్య నిలయం సంస్థ ఆధ్వర్యంలో కులపతి భాగవతుల రామకోటయ్య శత జయంత్యుత్సవాలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. అనాదిగా ప్రపంచమంతటా స్త్రీలపై జరుగుతున్న హింసపై రచయిత్రి ఓల్గ రచనలతో, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత భాగవతుల సేతురామ్ నృత్య రూపకల్పనలో సాగిన లక్ష్మణ రేఖ, నృత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

నాలా ఇలా.. వదిలేస్తే ఎలా..?

- పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం
- కన్నెత్తి చూడని అధికారులు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



కృష్ణానగర్ బస్తీ నాలా దుస్థితిని చూపిస్తున్న స్థానికులు

కాచిగూడ: అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా.. నాలాల దశ మారడం లేదు. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో.. పలు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తున్న నాలాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల మురుగు వెళ్లడానికి కూడా వీల్లేనంతగా వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. దీంతో ఆయా నాలాల పరివాహక ప్రాంతాల వాసులు ఇళ్లలో ఉడలేని పరిస్థితి నెలకొంది. రోజంతా భరించలేని మురుగు కంపునకు తోడు, రాత్రిళ్లు దోమల బెడదతో అవస్థల పాలవుతున్నారు. మరోవైపు నాలాల్లో పూడికతీత పనులకు జీహెచ్ఎంసీ ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తోంది. సంబంధిత పనులను సక్రమంగా చేపట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం ఉండటం లేదు.

దోమల బెడదతో రోగాల బారిన ప్రజలు

నాలాలలో పూడికతీతను చేపట్టకపోవడంతో పరిశుభ్రత కొరవడి దోమల పెరుగుదలకు ఆస్కారం ఏర్పడుతోంది. నాలాల్లో నెలల తరబడి పూడికతీతలు చేపట్టకపోవడంతో కొట్టుకు వచ్చిన చెత్తాచెదారాలు దుర్గంధపూరితంగా తయారై ముక్కుపుటలదిరేలా కంపు కొడుతోంది. అంతేకాకుండా నాలాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అధ్వాన స్థితికి చేరుకున్నాయి. పలు నాలాల్లో దుర్గంధపూరిత పదార్థాలు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. సాయంత్రం అయితే నాలాల పరిసర ప్రాంతాల్లో దోమల మోతతో ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని వైనం

గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్ నాలాను చూస్తూ అసలు ఇది నాలానేనా..? అనే అనుమానం కలుగుతోంది. ఏళ్లు గడుస్తున్నా నాలా అభివృద్ధికి నోచుకోవడం లేదు. నాలా దుస్థితిపై స్థానికులు అధికారులనే బాధ్యులుగా చూస్తున్నారు. నాలాలో వ్యర్థాల డంపింగ్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు పూర్తిగా మరిచారు. ఎప్పుడో ఏడాదికి ఒకసారి గట్టిదనం లేదని ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న అధికారులు ఆ ఫెన్సింగ్ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు.

- నాలాలో వ్యర్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో నీరు సరిగ్గా కదలడం లేదు. నాలాలో నీరు పూర్తిగా దుర్వాసనతో నల్లగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. నాలా పరిసరాల వారు తాము దుర్గంధంతో సావాసం చేస్తున్నామని అంటున్నారు. వర్షాకాలంలో నాలా పొంగిపొర్లుతూ తమ ఇళ్లలో వరద చొచ్చుకు వస్తోందని పలువురు అంటున్నారు. నాలాకు ఎత్తైన ప్రహరీ నిర్మించి ఫెన్సింగ్ వేసి వరద నీరు పొంగకుండా చూడాలన్నారు. ముందుగా నాలాలోని వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కంపు కొడుతున్నాయి..



నాలాలోని చెత్తను తొలగించడం లేదు. జంతు కళేబరాలు పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. నాలా పరిసర ప్రాంతవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలలోని చెత్తను తొలగించాలి.

– ఎస్.దేవేందర్ రాజు, బస్తీ అధ్యక్షుడు



బస్తీలోని మైసమ్మ దేవాలయం వద్ద నాలా నుంచి తీసిన మట్టి



నాలలో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం



కూలిన నాలా ప్రహరీ

నాలాలపై దృష్టి పెట్టాలి..



జీహెచ్ఎంసీ అధికారులు నాలాల నిర్వహణపై దృష్టి పెట్టాలి. సకాలంలో నాలాలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి. ప్రతిఏటా జీహెచ్ఎంసీ లక్షల రూపాయలు ఖర్చ చేస్తోంది. కానీ అధికారుల నిర్లక్ష్యం, అసమర్థత కారణంగా పనులు నిర్వహించే కాంట్రాక్టర్లు మెసాలకు పాల్పడుతున్నారు. దీంతో నాలాలో చెత్త ఎక్కడికక్కడే ఉండిపోతోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి.

– ఎస్.సుధాకర్, బస్తీ కార్యదర్శి

చెత్తతోనే దోమలు



నాలాల్లో చెత్త పేరుకుపోయింది. దీని వల్లనే దోమలు పెద్ద ఎత్తున విజృంభిస్తున్నాయి. సాయంత్రమైతే దోమల దండయాత్ర షురూ అవుతోంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్తీలకు అనుకొని నాలాలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైపా జీహెచ్ఎంసీ అధికారులు నాలాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి.

– కె.నందు, కృష్ణానగర్

పూడికను తీసివేయాలి



నాలాల్లో పేరుకుపోయిన పూడికను తీసివేసి పిచ్చి మొక్కలను తొలగించి వ్యాధులు బారిన పడకుండా చూడాలి. నాలాలకు కంచె లేకపోవడంతో కొంతమంది ప్రజలు చెత్తను నాలాల్లోనే వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి కంచెను ఏర్పాటు చేయాలి.

– కె.రమేష్, కృష్ణానగర్

ఆర్‌సీ రెడ్డికి సివిల్స్‌లో ర్యాంకుల పంట

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అశోక్ నగర్‌లోని ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ అకాడమీకి ఈ ఏడాది సివిల్స్ ఫలితాల్లో మంచి ర్యాంకులు వచ్చినట్లు సంస్థ డైరెక్టర్ ఆర్.సి రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర తెలిపారు. మంగళవారం అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ పొందిన ఆర్.జై సింహా రెడ్డి (46), సాయి చైతన్య, (68) చక్క నేహిత్ (94), ఎన్.శ్రీకాంత్‌రెడ్డి (151), కె. శ్రీకృష్ణ సాయి (190), ఒల్లం ఉమా మహేశ్వరరెడ్డి (221) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. మరికొందరికి కూడా ఉత్తమ ర్యాంకులు వచ్చినట్లు తెలిపారు.

సీఎస్‌బీ అకాడమీ ప్రభంజనం

అశోక్ నగర్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో అనేక మంది అభ్యర్థులు సివిల్ సర్వీసుకు ఎంపికయ్యారు. ఈ అకాడమీ నుంచి రావుల జై సింహారెడ్డి 46వ ర్యాంక్, సాయి చైతన్య 68వ ర్యాంక్, కొలిపాక శ్రీకృష్ణసాయి 190వ ర్యాంక్, మసమ్మగారి పవన్‌కుమార్ 375 ర్యాంక్ సాధించినట్లు సంస్థ డైరెక్టర్ బాలలత తెలిపారు.

78 మందికి సివిల్స్: ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ

ఈసారి తమ అకాడమీ నుంచి 78 మంది సివిల్ సర్వీసుకు ఎంపికయ్యారని లా ఎక్సలెన్స్ అకాడమీ డైరెక్టర్ రాంబాబు తెలిపారు. బాగా చదివే విద్యార్థులను ఎంపిక చేసి దాదాపు 150 మందికి తాము ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగేళ్ల తమ కృషికి ఫలితం లభించిందన్నారు.

రూ.7500 కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించాలి

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న రూ.7500 కోట్ల విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. కాలేజ్ యాజమాన్యాలు, లెక్చరర్స్‌కు జీతాలు చెల్లించకపోవడంతో లెక్చరర్స్ సహకారం లేక, అద్దె భవనాల యాజమాన్యాల ఒత్తిడి వల్ల కాలేజ్ యాజమాన్యాలు బైకాట్ చేయడంతో విద్యార్థుల భవిష్యత్‌పై అంధకారంగా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని లేని పక్షంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుల వినూత్న నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్ట్ అధ్యాపకులు వినూత్న నిరసనకు దిగారు. ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని నాలుగు రోజులుగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు చేతికి సంకెళ్లు వేసుకొని ర్యాలీ నిర్వహించారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ఈ నెల 21న అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి పాలన భవనం వరకు ఈ ర్యాలీ చేపట్టినట్లు అధ్యాపకులు పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ పాలన భవనం ఎదుట ఏర్పాటు చేసిన టెంట్ కింద ఓయూతో పాటు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ పరశురామ్, డాక్టర్ సీమర్ల విజేందర్‌రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ తిరుపతి, డాక్టర్ రేష్మారెడ్డి, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

'రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది'

ముషీరాబాద్: వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో తెలంగాణ జాగృతి నగర నాయకుడు పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నేపథ్యంలో వాల్ రైటింగ్, తెలంగాణ జాగృతి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శివముదిరాజ్, టెంట్‌హౌజ్ శ్రీనివాస్, వై.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ విలువలతో కూడిన పద్ధతులను నేర్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో కళారాధన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డ్యాన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారులను శాస్త్రీయ సంగీత కళలపై తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు నాట్య గురులు, చిన్నారులను ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాట్య గురువు పసుమర్తి శేషుబాబు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ సత్యం, సంస్థ వ్యవస్థాపకులు పి.జయంతి పాల్గొన్నారు.



చిన్నారులతో ఆర్.కృష్ణయ్య తదితరులు

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 60 శాతానికి పైగా ఉత్తీర్ణత

కాచిగూడ: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 60శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ సూదం కీర్తి 975 మార్కులు సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచారని తెలిపారు. అదే విధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ అవిక కన్సాల్ 448 మార్కులు సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అభినందించారు. కళాశాలలో మరిన్ని ఉత్తమ ఫలితాలు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.



అవిక కన్సాల్ (ఎంపీసీ 448) ఫస్ట్‌ఇయర్



సూదం కీర్తి (ఎంపీసీ 975) సెకండియర్

2, 4, 6వ స్థానంలో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇంటర్ ఫలితాలలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ డా. సరోజ వివేక్, ప్రిన్సిపాల్ డా. భారతి తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 4, 6వ స్థానంలో తమ విద్యార్థులు నిలిచారని తెలిపారు. కళాశాలకు మంచి ర్యాంకులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సీవరేజీ పైపులు వేయించండి

- జలమండలి డీజీఎంకు తిలక్‌నగర్ బస్తీవాసుల వినతి
- పైపుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్న డీజీఎం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నూతన పైపులైన్ పనులకు శ్రీకారం

నల్లకుంట: తిలక్‌నగర్ బస్తీలో కొంత కాలంగా కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు శివం సెక్షన్ జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జలమండలి మేనేజర్ రోహిత్, తన సిబ్బందితో కలిసి కుళాయిలో నీళ్లు వదిలే రోజు వేకువ జాముననే పలు మార్లు ఆ బస్తీలో పర్యటించారు. అన్ని చోట్ల నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించారు. మ్యాన్ హోళ్లలోని వ్యర్థాలను తొలగింపజేసి, సీవరేజీ, డ్రైనేజీ పైపులను పరిశీలించినప్పటికి సమస్య ఎక్కడున్నదో తెలియరాలేదు. దీంతో పైపులైన్ ఉన్న చోట తవ్వి చూడగా పైపుల్లో మురుగు కలుస్తున్నట్లు గుర్తించారు. ఆ వీధి చిన్నగా ఉండడం, పైగా పైపు లైన్ ఉన్న ప్రాంతంలో ఓ పెద్ద బండరాయి ఉండడంతో కొత్త పైపుల పునరుద్ధరణకు ఆటంకం ఏర్పడింది.



జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న తిలక్‌నగర్ బస్తీ ప్రతినిధులు

- బండరాయి తొలగించి నూతన పైపులైన్ వేయించాలంటే అదనపు నిధులు అవసరమవుతాయని తెలిపారు. అందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని పనులు ప్రారంభిస్తామని జలమండలి మేనేజర్ రోహిత్ తెలిపారు.
- దీంతో శివం జలమండలి మేనేజర్ రోహిత్ సూచన మేరకు మంగళవారం బస్తీ ప్రతినిధులు బత్తుల రవి, పోతరాజు బలరామ్ తదితరులు డీడీ కాలనీలో గల జలమండలి కార్యాలయంలో డీజీఎం సీహెచ్. విష్ణువర్ధన్‌రావుని కలిసి కొంత కాలంగా కుళాయిల ద్వారా కలుషిత నీటిసరఫరా సమస్య పరిష్కారానికై నూతన పైపు లైన్ వేయించాలని కోరుతూ ఓ వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఈ సమస్యను తమ అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని డీజీఎం విష్ణువర్ధన్ రావు తెలిపారు. జలమండలి స్పెషల్ బడ్జెట్ నిధుల ద్వారా పనులు చేయించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేసి పంపించామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తామని డీజీఎం హామీ ఇచ్చారు. తెల్ల పేపర్‌పై కాకుండా బస్తీ సంఘం లెటర్ హెడ్‌పై వినతి పత్రం ఇస్తే బాగుంటుందని బస్తీ ప్రతినిధులకు డీజీఎం సూచించారు.